
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

అగ్గిరాజుకుంటే బుగ్గే - కానరాని ఫైర్ సేఫ్టీ నిబంధనలు 8లో..

8లో.. ప్రధాని మోదీకి మద్దతుగా నిలవండి

సమరానికి సై



సిరిసిల్లలో సాయుధ దళాల కవాతు

- వెలువడిన లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- మొదలైన నామినేషన్ల స్వీకరణ
- 25వరకు నామినేషన్లు... మే 13న పోలింగ్
- ఫలితాలకు జూన్ 4 వరకు ఆగాల్సిందే
- బీఆర్ఎస్, బీజేపీ ప్రచారాలు
- కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల సమరానికి తెరలేచింది. ఇప్పటికే షెడ్యూలు విడుదల కాగా గురువారం నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో రాజకీయ సమరానికి తెరలేచింది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కావడంతో రెండు సెగ్మెంట్లలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రచారంలో ముందు వరుసలో నిలిచే ప్రయత్నంగా సన్నద్ధం అయ్యారు. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పార్టీని వీడుతుండడంతో కొంత స్తబ్దతగా ఉంది. లోక్‌సభ నామినేషన్ల పర్వం మొదలు కావడంతో సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో రాజకీయ వేడి మొదలైంది.

● వేగంగా ఎన్నికల ఏర్పాట్లు

సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. ఈనెల 25 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండగా 26న పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ వరకు సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఫలితాల కోసం జూన్ 4 వరకు ఆగాల్సిందే. ఇందుకు సంబంధించి రెండు సెగ్మెంట్లలో 537 పోలింగ్ కేంద్రాలు, కావాల్సిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లులను ఇప్పటికే సిద్ధం చేసి ర్యాండమైజేషన్ పూర్తి చేశారు.

● జిల్లాలో నిఘా.. తనిఖీలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో పోలీసులు, ఎన్నికల అధికారులు నిఘా పెంచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లెల చెక్‌పోస్టు, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్దమ్మ చెక్ పోస్ట్, ముస్తాబాద్, పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకట్రావుపల్లి, వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు, బోయినపల్లి చెక్ పోస్టు పరిధిలో కొదురుపాక, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో మానాల క్రాస్ రోడ్డు వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా నగదు, అక్రమ మద్యంపై కూడా నిఘా పెట్టారు. వివిధ పార్టీల నాయకులు ప్రచారాలకు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో వారి వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నారు. రూ 50 వేలకు పైగా నగదు ఉంటే ఆధారాలు చూపని పక్షంలో సీజ్ చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో బ్యాంకుల్లో నగదు లావాదేవీలపై కూడా ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టింది.

● జిల్లాకు కేంద్ర సాయుధ బలగాలు...

లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా బందోబస్తు కోసం కేంద్ర సాయుధ బలగాలు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకున్నాయి. సాయుధ బలగాలు కవాతులు నిర్వహించి మేమున్నామంటూ భరోసాను ఇస్తున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

● రెండు అసెంబ్లీ సెగ్మెంట్లలో 4.72లక్షల మంది ఓటర్లు

లోక్‌సభ ఎన్నికల కోసం ఓటరు జాబితాను సిద్ధం చేశారు. తుది జాబితా తరువాత ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ అవకాశాన్ని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 1,197 మంది ఉపయోగించుకున్నారు. రెండు సెగ్మెంట్లకు సంబంధించి కొత్త ఓటరు జాబితా ప్రకారం నాలుగు లక్షల 72 వేల 116 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,27,534 మంది, మహిళలు 2,44,543 మంది, ఇతరులు 39 మంది ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,904 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,952 మంది, మహిళలు 1,17,920 మంది ఇతరులు 32 మంది ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,212 మంది ఉండగా పురుషులు 1,19,582 మంది, మహిళలు 1,26,623 మంది, ఇతరులు ఏడు మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4,72,116 మంది ఓటర్లు ఉండగా మహిళలు అధికంగా 17,009 మంది ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో మహిళలు 9,968 మంది, సిరిసిల్ల సెగ్మెంట్‌లో మహిళలు 7,041 మంది అధికంగా ఉన్నారు. సెగ్మెంట్లలో ఎన్నికల సమయంలో ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఓటు వేసే పరిస్థితులు లేకుండా ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చారు. పోలింగ్ కేంద్రాల్లో 1,500 మంది ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు చేపట్టారు.

నామినేషన్ల ప్రక్రియ షురూ..

● తొలిరోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు

కరీంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి 100 మీటర్ల దూరం వరకు ప్రజలను అనుమతించారు. గురువారం మొదటి రోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు మాత్రమే నామినేషన్లను సమర్పించారు. తొలి నామినేషన్‌ను నగరంలోని విద్యానగర్‌కు చెందిన కోట శ్యాంకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన పొత్తూరి రాజేందర్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల అధికారికి అందజేశారు. నామినేషన్ల దాఖలు చేసేందుకు వచ్చిన వారికి హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచారు. అదనపు కలెక్టర్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నామినేషన్ల పత్రాలను పరిశీలించారు. శుక్రవారం బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్ నామినేషన్‌ను సమర్పిస్తారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకుంటాం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుమన్‌రావు

వీర్నపల్లి, ఏప్రిల్ 18: ఆరోగ్య ఉపకేంద్రాన్ని అపరిశుభ్రం చేస్తూ తాగునీటి పైపులను ధ్వంసం చేస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు హెచ్చరించారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి చేరుకున్న ఆయనకు ధ్వంసమైన పైపులు, పగిలిన మద్యం సీసాలు కనిపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఆకతాయిలు ప్రతిరోజు మద్యం తాగుతూ సీసాలను పగులగొడుతున్నారని, సిబ్బంది జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రజలు అపరిశుభ్రం చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మద్యం తాగుతూ అపరిశుభ్రపరుస్తున్న ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఆశావర్కర్లను గ్రామాల్లో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ప్రభుత్వం అందించే మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి చిరంజీవి, ఏఎన్ఎమ్ మంజుల, ఆశావర్కర్లు ఉన్నారు.

బాలుర వసతి గృహం కోసం అద్దె భవనం పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా షెడ్యూల్ కులాల సహాయ అభివృద్ధి అధికారి

చందుర్తి, ఏప్రిల్ 18: చందుర్తి మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న భవనంలో నుంచి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చేందుకు, వేరొక అద్దె భవనాన్ని జిల్లా షెడ్యూల్ కులాల సహాయ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి పరిశీలించారు. మండల కేంద్రంలో ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో ఉన్న వసతి గృహాన్ని వేరొక అద్దె భవనంలోకి మార్చేందుకు పరిశీలించినట్లు పేర్కొన్నారు. కాగా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం లింగంపేట గ్రామానికి చెందిన పురుగుల ప్రశాంత్ అనే యువకుడు దరఖాస్తు చేసుకోగా గురువారం జిల్లా షెడ్యూల్ కులాల సహాయ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగుల ప్రశాంత్ అనే యువకుడు ప్రభుత్వం అందించే 20 లక్షల ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద మంజూరు చేసేందుకు లింగంపేట గ్రామానికి వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలించి, విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆమె వెంట చందుర్తి వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్రస్వామి ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రుద్రంగి ఏప్రిల్ 18: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ సహాయ అధికారి విజయలక్ష్మి సూచించారు. రుద్రంగి సంక్షేమ వసతి గృహాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ రవీంద్రస్వామి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

చందుర్తి ఏప్రిల్ 18: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అధికారులను ఆదేశించారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో చందుర్తి, రుద్రంగి మండలాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం డీపీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బందితో చేయించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరం గాని ఇంటి పన్నుల వసూలను చేపట్టాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో ప్రదీప్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: ఎల్లారెడ్డిపేట మండల గౌడ సంఘ భవన నిర్మాణానికి గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్-రాధ దంపతులు స్థానిక నాయకులతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. గ్రామ శివారులో సంఘ భవనం కోసం చిదుగు గోవర్ధన్‌గౌడ్ తన సొంత నిధులు 11 లక్షల రూపాయలతో స్థలాన్ని కొనుగోలు చేసి అప్పగించారు. మండల అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్ భవన నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందించారు. గౌడ సంఘం సభ్యులు ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు. భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, మురళీమోహన్‌గౌడ్, నారాయణగౌడ్, అంజాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

చందుర్తి, ఏప్రిల్ 18: మండలంలోని మల్యాలలో బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు గురువారం క్రీడారారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈర్లపల్లి రాజు మాట్లాడుతూ గ్రామీణ యువత వేసవికాలంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో ప్రయాణించాలన్నారు. క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన స్వామివారు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తుల భజనలు కోలాటాల నడుమ స్వామివారు ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అపేరా సుల్తానా, మాజీ సర్పంచ్ దొమ్మాటి నరసయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, ఆలయకమిటీ చైర్మన్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో భారీ వర్షాలు.. ప్రవాస కార్మికుల ఇక్కట్లు



దుబాయ్‌లో వరదనీటిలో మునిగిన వాహనాలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 18: గల్ఫ్ దేశాల్లో భారీ వర్షాలు కురవడంతో ప్రవాస కార్మికులు అతలాకుతలం అయ్యారు. మూడు రోజుల క్రితం ప్రారంభమైన భారీ వర్షాలు ఇపుడిపుడే తగ్గుముఖం పట్టాయి. గల్ఫ్ దేశాల్లోని ప్రవాస కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... దుబాయ్, బహ్రెయిన్, ఒమాన్ దేశాల్లో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో భవన నిర్మాణ రంగంలో, ఇతర విభాగాల్లో పనిచేసే ప్రవాస కార్మికులు క్యాంపులకే పరిమితమయ్యారు. భారీ కుంభవృష్టి కారణంగా దుబాయ్, బహ్రెయిన్, ఒమాన్ దేశాల్లో ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలకు శుక్రవారం వరకు సెలవులు ప్రకటించారు. ఈనెల 16, 17న దుబాయ్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురువడంతో ప్రవాసకార్మికులు పనులకు వెళ్లి తిరిగి క్యాంపులకు చేరుకోవడానికి తీవ్ర అంతరాయం కలిగింది. దుబాయ్‌లోని రహదారులపై భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వరదల్లో వందలాది వాహనాలు ఇరుక్కుపోయాయి. రహదారులపై వరదనీరు ప్రవహించడంతో నిలిచిపోయిన వాహనాలతో ట్రాఫిక్‌కు సమస్య తీవ్రమైంది. దుబాయ్‌లోని విమానాశ్రయంలో వరదలు తగ్గలేదు. టర్మినల్-3 పూర్తిగా వరదల్లో మునిగిపోయింది. దీంతో పలు అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. కేవలం టర్మినల్-1 నుంచి మాత్రమే పరిమితమైన విమానాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దుబాయ్ లోని పలు ప్రాంతాల్లో మెట్రో రైళ్లు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం నిర్వహిస్తున్నారు. దుబాయ్, బహ్రెయిన్, ఒమాన్‌లో గురువారం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఎండలు రావడంతో ప్రాంతాలన్నీ ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఈ జలవిలయాన్ని గల్ఫ్ దేశాల్లో చాలా కాలం క్రితం నుంచి చూసిన దాఖలాలు లేవని దుబాయ్‌లో ఉంటున్న గల్ఫ్ వర్కర్స్ అవేర్‌నెస్ సెంటర్ ప్రతినిధి కటుకం రవి 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

● కార్మికుల యోగక్షేమాలపై ఆరా..

గల్ఫ్ దేశాలైన దుబాయ్, బహ్రెయిన్, ఒమాన్ దేశాల్లో కుంభవృష్టితో జలవిలయం కావడం వల్ల ప్రవాస కార్మికుల యోగక్షేమాల కోసం వారి కుటుంబసభ్యులు ఆరా తీస్తున్నారు. దుబాయ్‌లో భారీ వర్షాల కారణంగా వరదల్లో కారులో చిక్కుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు చెందిన భాస్కర్ అనే ప్రవాసకార్మికుడు మృతిచెందినట్లు తెలంగాణ కాంగ్రెస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు ఎస్. వేణురెడ్డి తెలుపడంతో మిగితా కార్మికులు ఎలా ఉన్నారని సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ ప్రాంతాల నుంచి దుబాయ్ వెళ్లిన ప్రవాస కార్మికులు ఎలా ఉన్నారని ఫోన్‌ల ద్వారా తెలుసుకుంటున్నారు.

వరదల్లో చిక్కుకొని గుండెపోటుతో యువకుడి మృతి



భాస్కర్ (ఫైల్)

ఇల్లంతకుంట: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అక్కడ వచ్చిన వరదల్లో చిక్కుకొని ఇల్లంతకుంట మండలం ఒగులాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల భాస్కర్ (39) మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం 12 సంవత్సరాలుగా భాస్కర్ దుబాయి పోతు వస్తుంటాడు. రెండు నెలల క్రితం ఇంటికి వచ్చిన భాస్కర్ 10 రోజుల క్రితం దుబాయి వెళ్లాడు. దుబాయిలో డ్రైవర్ పనిచేస్తూ జీవించే భాస్కర్ తనతో పాటు ఉన్నవారితో కారులో కంపెనీకి బయలుదేరాడు. వరదనీరు ఎక్కువగా ఉండటంతో కారులో ప్రయాణించిన తోటి స్నేహితులు దిగిపోయారు. నీటిలో నుంచి కారులో వెళ్లిన భాస్కర్ కొంతదూరం వెళ్లగానే గుండెపోటుతో మృతిచెందాడు. భాస్కర్ రాకపోవడాన్ని గమనించిన స్నేహితులు వెళ్ళిచూడగా కారులో మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని త్వరగా ఇంటికి వచ్చేలా చూడాలని బంధువులు కోరుతున్నారు.

జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 18: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లోని విశ్వనాథ స్వామి ఆలయ భూముల అక్రమ నకిలీ కాగితాలతో లే అవుట్ తీసి వాటికి అనుమతులు ఇచ్చిన జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి పై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ శాంతినగర్‌లోని సర్వే నెంబర్ 1563లో విశ్వనాథ స్వామి దేవస్థానంకు చెందిన దేవాదాయ శాఖకు చెందిన భూమి కబ్జాకు గురైందని తెలిసి కూడా లే అవుట్ క్యాన్సిల్ చేయకుండా అనుమతులు ఇవ్వడం సరైంది కాదన్నారు. దేవాలయ భూములు పరిశీలించకుండానే లే అవుట్‌కు అనుమతులు ఇచ్చిన అధికారి సస్పెండ్ చేయడంతో పాటు 40 ఫీట్ల రోడ్డును చూపించి అప్రూవల్ తీసుకున్న వారు లే అవుట్‌లో 27 ఫీట్ల రోడ్డును వేస్తున్నారని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోనె ఎల్లప్ప, కల్లూరి చందన, ఎమ్మార్పీఎస్ నాయకులు కానాపురం లక్ష్మణ్, అవునూరి ప్రభాకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, బుర్ర మల్లేశంగౌడ్, సోమిశెట్టి దశరథం, చిట్యాల మధు, తదిరులు పాల్గొన్నారు.

రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 18: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 457క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు


పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

హుజూరాబాద్, ఏప్రిల్ 18: పట్టణంలోని వరంగల్ రోడ్డులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 10న చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డ రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వాహన తనిఖీల్లో హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కు ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 350 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించగా గురువారం రేషన్ బియ్యంగా అధికారులు గుర్తించారు. బియ్యం తరలిస్తు న్న ఇద్దరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీలు వినోద్, వసంతరావు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గుండవేణి చిన్నక్క (98) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు చేదబావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గుండవేణి చిన్నక్క బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలో కూర్చొని ముచ్చటించుకుటున్న సమయంలో ఆరుబయటకు వచ్చింది. చిన్నక్కకు సరిగా కళ్లు కనబడక పోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికుల సహాయంలో కుటుంబ సభ్యులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకుండా పోయినట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. చిన్నక్క కుమారుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం కొన్ని రోజులగా మతిస్థిమితం లేక తిరుతుండే వాడని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదని తెలిపారు. స్థానిక రైతులు గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అడ్లగట్ల రాజేశం భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గంటల మనీష్‌రెడ్డి(31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంటల గోపాల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొంది ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. చిన్న కొడుకు మనీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వర్క్‌ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. మనీష్‌రెడ్డి తల్లికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆమెతోపాటు గోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం 6 గంటలకు వరంగల్‌కు వెళ్లారు. ఆ రోజు మధ్యాహ్నం మనీష్‌రెడ్డి సమీపంలోని తన పెదనాన్న ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. గురువారం 12 గంటలకు వరంగల్ నుంచి తిరిగి వచ్చిన గోపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లో మనీష్‌రెడ్డి మృతదేహం ఉరికి వేళాడుతూ కనిపించింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, తనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని ఒక సూసైడ్ లెటర్ టేబుల్‌పై ఉన్నట్లు గుర్తించారు. తన కొడుకు కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడని ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిన చేయి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: రైతు హార్వెస్టర్ ద్వారా పొలం కోస్తుండగా ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో చెయ్యి ఇరుక్కుని తెగిపోయిన సంఘటన మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంగల సదాశివరెడ్డి గురువారం పొలం కోస్తూ వరి గొలుసులు హార్వెస్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు కుడి చేయి హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిపోయింది. తోటి రైతులు వెంటనే తెగిన కుడిచేయితో పాటు గాయాలపాలైన సదాశివరెడ్డిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు.

ఐదుగురు రౌడీషీటర్ల బైండోవర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఐదుగురు రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన రౌడీషీటర్లు హస్తపురం విష్ణు, హస్తపురం ఆంజనేయులు, మేక శివకుమార్, హస్తపురం పవన్ కుమార్, హస్తపురం వంశీలను బైండోవర్ చేశామని పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఎప్రిల్ 18: బీఆర్ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. కమలాకర్‌రెడ్డి తన భూమి కాకున్నా తనసొంత భూమి అని చెప్పి దుబ్బాక మండలం నగరం గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి అమ్మాడని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు. మొదటి కిస్తి కింద భూమి కొనుగోలు చేసిన రాములు కమలాకర్‌రెడ్డికి 2 లక్షల రూపాయలు కూడా ఇచ్చాడన్నారు. ఆ భూమి కమలాకర్‌రెడ్డికి కాదని తెలిసి రాములు తాను ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వమని అడిగితే కమలాకర్‌రెడ్డి ఇవ్వడం లేదని రాములు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. రాములు ఫిర్యాదు మేరకు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అదే భూమికి సంబంధించి కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు అయినట్లు, బాధితులు ఇంకెవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రాంమోహన్ సూచించారు.

లేగదూడలపై కుక్కల దాడి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: మండలంలోని పెగడపల్లిలో గురువారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. దారివెంట వెళ్లే వారిపై దాడిచేయడంతో పాటు ఇళ్ల వద్ద కట్టేసిన లేగదూడలపై దాడి చేశాయి. దీంతో గ్రామస్థులు కుక్కలను కర్రలతో తరిమివేశారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, ఏప్రిల్ 18: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీ చేయగా, ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కన్పించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని 4,360 రూపాయలను, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

రుద్రంగి మార్చి 18: అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి మండలం అడ్డబోరు తండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో అడ్డబోరు తండా గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, వాచర్ రాజుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు రాళ్లతో దాడి చేశారు. దీంతో బాలకృష్ణ, రాజులకు గాయాలు అయ్యాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో ఈ నెల 16న రాత్రి మృతదేహం ఆచూకీ గుర్తించినట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ (33) మంచిర్యాలలోని స్నేహితున్ని కలవడానికి వచ్చి వడదెబ్బ తగిలి మృతిచెందాడన్నారు. వ్యవసాయం చేసి జీవించే రాజేందర్ అవివాహితుడని తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి

వీణవంక, ఏప్రిల్ 18: వీణవంక మండలంలోని గంగారం గ్రామంలో గురువారం వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి దేవరకొండ పార్వతి (13) అనే బాలిక మృతి చెందింది. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్ బాతులు పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం యాసంగి కోతలు ఉన్నందున నెల రోజుల క్రితం గంగారం గ్రామానికి కుటుంబంతో సహ వచ్చాడు. బాతులను పొలాల్లో మేతకు తీసుకెళుతున్నారు. గురువారం బాతులను కుటుంబ సభ్యులు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో పార్వతికి దాహం వేయడంతో గంగారం గ్రామంలోని గూడేపు తిరుపతిరెడ్డి వ్యవసాయ బావిలో నీరు తాగేందుకు దిగింది. ఈ క్రమంలో పార్వతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తోట తిరుపతి కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లగొండ శివారులో మామిడి తోట పక్కన గుట్టపైన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండి నీలి రంగు జీన్ ప్యాంట్, మెడలో మల్లన్న స్వామి తాడు ధరించిన పురుష మృతదేహం ఉందని గ్రామ ప్రత్యేక అధికారి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం వ్యాఖ్యలు

● బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 18: సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఉన్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాం నిందితుడు, వ్యాపార వేత్త శరత్‌చంద్రారెడ్డి బీజేపీకి 500 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్‌లు ఇవ్వగానే బెయిల్ వచ్చిందంటూ మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొన్నం వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటాగా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్స్‌కు, బెయిల్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఏ సర్వేలు చూసినా బీజేపీకి 400 సీట్లు వస్తాయని తేలడంతో కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్స్ జాతీయ పార్టీలతో పాటు స్థానిక పార్టీలకు సైతం వచ్చాయన్నారు. రాష్ట్రంలో బండి సంజయ్ పోరాటంతోనే కేసీఆర్‌పై వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. అంతే తప్ప పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ 5 లక్షల మెజారిటీతో గెలువబోతున్నారని తేలడంతో పొన్నంకు భయం పట్టుకుందని కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ పొన్నం మంత్రి కాగానే తన స్థాయిని తానే తగ్గించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

కరీంనగర్‌లో ప్రజల్లో స్థానం లేదని పొన్నం అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ పారిపోయాడన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ మాట్లాడుతూ బండి సంజయ్ చేసిన పోరాటాలతోనే కేసీఆర్ సర్కార్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కుమ్మరి శంకర్, కరండ్ల మధూకర్, రమణారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మానకొండూర్, ఏప్రిల్ 18: మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద బుధవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లి గ్రామానికి చెందిన మురికిపూడి చెన్నయ్య (36) అనే వ్యక్తి మేస్త్రీ పని నిమిత్తం శ్రీను అనే కాంట్రాక్టర్ వద్దకు కరీంనగర్‌కు వచ్చాడు. మద్యానికి బానిసైన చెన్నయ్య ఈ నెల 14నుంచి పనికి వెళ్లలేదు. బుధవారం మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గురువారం చెన్నయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెన్నయ్య వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సాయ్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన సాయ్ హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎం.సంజీవ్ (రామడుగు), ఎస్. ఈశ్వర్ (కాటారం), ఎం.చంటి, బి.దేవేందర్ (గుల్లకోట), బి.వంశీ (గుల్లకోట) ప్రతిభ చాటి క్రీడా హాస్టల్‌కు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని సంఘం సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 18 : శంకరపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్ గురువారం కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతుండగా కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షించారు. శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో గురువారం మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా లేక్ పోలీసులు అనుమానించి అతడిని అడ్డుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంజన్న దీక్షాపరుడిపై ఆంక్షలు

● ఉద్యోగం నుంచి తొలగించిన ఓ ప్రైవేటు సంస్థ మేనేజర్ ● అంజన్న స్వాముల ఆందోళన

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆంజనేయ స్వామి మాల ధరించి విధులకు హాజరవుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి పట్ల మరో ఉద్యోగి ఆంక్షలు విధించాడు. నిబంధనల ప్రకారం బూట్లు వేసుకుని విధులకు హాజరు కావాలని లేకుంటే రావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు. మధ్నాహ్నం సమయంలో భిక్ష(భోజనానికి)కు అరగంట మాత్రమే సమయమంటూ వేధించాడు. అంతే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. టూల్ కిట్ తీసువచ్చేంత వరకు ద్విచక్రవాహనం ఇవ్వనని దాన్ని స్వాధీనం చేసుకుని ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో దీక్షాపరుడు జరిగిన విషయాన్ని వీహెచ్‌పీ, బీజేపీ, అంజన్న దీక్షాపరులకు తెలియజేశాడు. వారు ఆందోళన చేపట్టగా పోలీసులు రంగప్రవేశం చేసి బాధితుడికి సారీ చెప్పించడంతో వివాదం సర్దుమణిగింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావు పేట గ్రామానికి చెందిన రుద్రారపు నవీన్ అనే యువకుడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న జియో ఫైబర్ నెట్‌వర్క్ సర్వీసర్‌గా మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. నవీన్ ఆరు రోజుల క్రితం అంజన్న దీక్ష తీసుకుని విధులకు హాజరవుతున్నాడు. అప్పటి నుంచి కంపెనీ మేనేజర్ సురేష్ అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. మాల ధరించి విధులకు హాజరు కావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు, కంపెనీ నిబంధనల ప్రకారం షూ వేసుకుని రావాలని, భిక్షకు కేవలం అరగంట సమయం మాత్రమే తీసుకోవాలంటూ ఆంక్షలు విధించాడు. శ్రీరామనవమి రోజున సదరు మేనేజర్ నవీన్‌పై ఉన్న కోపంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నానని తెలుపడంతో పాటు కంపెనీ టూల్ కిట్ ఇచ్చేంత వరకు ద్విచక్రవాహనాన్ని ఇచ్చేది లేదంటూ



జగిత్యాలలో ధర్నా నిర్వహిస్తున్న అంజన్న స్వాములు

వాగ్వాదానికి దిగాడు. గురువారం నవీన్ అంజన్న భక్తులతో పాటు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులకు విషయం తెలిపాడు. ఆగ్రహంతో వారందరూ జియో షోరూం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి నాలుగు గంటల అనంతరం మేనేజర్‌తో సారీ చెప్పించడంతో అంజన్న భక్తులు ఆందోళనను విరమించారు. జగిత్యాలలో అంజన్న భక్తుడిని అవమానించిన ఘటనను తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ బాధితునితో ఫోన్లో మాట్లాడి ధైర్యం నింపారు. ముంబైలో ఉన్న కంపెనీ యజమానికి ఫోన్ చేసి తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి కట్టడికి కఠిన చర్యలు

● ఖని ఏసీపీ మడక రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఏసీపీ మడక రమేష్ తెలిపారు. గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూటౌన్, కమాన్‌పూర్ స్టేషన్‌ల పరిధిలో ఈ నెలలో మూడు కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 85,675 విలువ గల 3 కిలోల గంజాయితో పాటు ఒక బైక్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన 17 మందిలో వారిలో 9 మంది అమ్మకం దారులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు డీలర్లు, ఒకరు కొరియర్, ఒకరు గంజాయి పండించే వ్యక్తి ఉన్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. వీరంతా కమాన్‌పూర్, జూలపల్లి, గోదావరిఖని, సెంటినరీ కాలనీ, మచ్చుపేట, గుంటూరుపల్లెకు చెందిన వారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి గంజాయి తీసుకువస్తున్న ముఖ్యమైన వ్యక్తి గొడిశెల శివ(రూట్ శివ)ను అదుపులోకి తీసుకుని విచారించిన మీదట, ఆదిలాబాద్ జిల్లా గడెగూడ మండలం లోకారి గ్రామంలో గంజాయి పండిస్తున్న నాగోరావ్‌ను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. గొడిశెల శివ, నాగోరావ్‌లను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఎస్సైలు సనత్‌కుమార్,



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమేష్

వెంకటేష్, కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, జే రమేష్, వెంకటస్వామి, రామచంద్రంలకు ఏసీపీ అవార్డులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్‌ను ఏసీపీ రమేష్ ఆవిష్కరించారు. గంజాయి, కల్తీ కల్లు అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 8712671111 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 18 : కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని డిల్లీ దాబా వద్ద రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు ఏఎస్‌ఐ చాంద్‌పాషా ఫోన్ నెంబరు 99084 40822, ఒకటో ఠాణా ఫోన్ నెంబరు 8331940591కు సమాచారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి, ఏప్రిల్ 18 : గొల్లపల్లి మండల కేంద్రంలోని రామాలయంలో జరుగుతున్న శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి 33వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 24 ఎడ్ల బండ్లు పోటీలో నువ్వా..నేనా అన్న రీతిలో చెమటోడ్చాయి. వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన క్యాతం జితేందర్‌కు చెందిన ఎడ్లబండి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా వెన్నుమట్ల గ్రామానికి చెందిన నేరేళ్ల సతీష్‌గౌడ్ నిలిచారు. తృతీయ విజేతగా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామియా ఎడ్లబండి నిలిచింది.

వడదెబ్బతో ఒకరి మృతి



గంగారాం (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్కం గంగారాం (42) అనే వ్యక్తి గురువారం చందుర్తి మండల కేంద్రంలో పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామ శివారులోని మామిడి తోట వద్దకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వెంటనే ద్విచక్ర వాహనంపై ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామం నుంచి జీవనోపాధి కోసం 20 సంవత్సరాల క్రితం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, కూతురు ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ



ఆది శ్రీనివాస్ వాహనంను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోయినపల్లి, ఏప్రిల్ 18: హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ముగించుకొని వేములవాడ వస్తున్న క్రమంలో గురువారం కొదురుపాక చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వారికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కోనరావుపేట, ఫిబ్రవరి 18: మండలంలోని మల్కపేట గుట్టపై నిర్మించిన కోదండరామస్వామి నూతన ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు.

అంజన్న భక్తుల కోసం రోడ్డుపై గడ్డితో నడకదారి

మల్యాల, ఏప్రిల్ 18: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగనున్న చిన్నహనుమాన్ జయంత్యుత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి నడిచి వచ్చే వేలాది మంది దీక్షాపరుల కోసం మండలంలోని నూకపల్లికి చెందిన యువకులు రహదారి పక్కన వరిగ్రాసంతో నడకమార్గం ఏర్పాటు చేస్తున్నారు. వేసవి ఎండలు మండి పోతుండడం.. రహదారిపై నడిచే భక్తుల కాళ్లకు బొబ్బలు రావడంతో వరిగ్రాసాన్ని రహదారి పక్కన పేర్చుతూ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీఆర్‌కే కళాశాల నుంచి మల్యాల క్రాస్‌రోడ్డు వరకు వరి గ్రాసంతో నూకపల్లికి చెందిన ఆర్మీ శ్రీనివాస్, చందు, స్వామి, జగదీష్, మనీష్, నాంపల్లి, ఆంజనేయులు నడక మార్గం ఏర్పాటు చేస్తుండగా వరి గ్రాసంను కనకట్ల శ్రీనివాస్ సమకూర్చాడు. వరి గడ్డి గాలికి కొట్టుకుపోకుండా దానిపై నీరు చల్లుతున్నారు.



అంజన్న స్వాములు నడిచేందుకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన గడ్డి

విధుల్లో అలసత్వం వహించిన పోలీసుల సస్పెన్షన్

సారంగాపూర్, ఏప్రిల్, 18: విధుల్లో అలసత్వం వహించినందుకు ఇద్దరు ఎస్‌ఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు గత సంవత్సరం ఫిబ్రవరిలో వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో ఉంచి పోలీస్‌స్టేషన్లో ఎస్సై రూమ్ సమీపంలో భద్రపరిచారు. కొద్ది రోజుల క్రితం అంబులెన్స్‌లో ఉన్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీన్ని గమనించిన పోలీసులు ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. హుటాహుటిన ఎస్పీతో పాటు జిల్లా స్థాయి పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన అప్పటి ఎస్సై మనోహర్ రావు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్సై తిరుపతితో పాటు హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టీ నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ 1 ఐజీ ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 18: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలకు పలువురు పశుగ్రాసాన్ని గురువారం అందజేశారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన రాజే 1000 కేజీల గ్రాసం అందించగా, వెంకటాపురం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి 17 వందల కేజీల గ్రాసాన్ని సంబందిత అధికారులకు అందించారు. అంతే కాకుండా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు పశుగ్రాసం అందించాల్సిన దాతలు నాంపల్లి గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన 3వ గోశాలకు తీసుకురావల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

నిలిపి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

గంగాధర, ఏప్రిల్ 18: గంగాధర మండలం కురిక్యాల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన వ్యాన్‌ను వెనకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహ మరో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన బస్సు(టీఎస్ 21జడ్ 0011) భద్రాచలం నుంచి కోరుట్లకు వెళ్తోంది. గంగాధర మండలం కురిక్యాల శివారు నుంచి సుమారు రాత్రి రెండు గంటల ప్రాంతంలో బస్సు వెళుతున్నది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన వ్యాను (ఎంపీ 13జీబీ 4566)ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీంతో బస్సు డ్రైవర్ మహేందర్, కండక్టర్ గంగరాంతో పాటు 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని కరీంనగర్‌కు తరలించారు. కోరుట్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వ్యాన్‌ను డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.



వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి మాధవి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18: నిరంతరం అభివృద్ధి గురించి ఆలోచించే బీఆర్ఎస్‌కు అండగా నిలువాలని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి, తాళ్ళపల్లి, ఇల్లంతకుంట, అనంతగిరి గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ పనుల వద్దకు జడ్పీవైస్ ఛైర్మన్ సిద్దం వేణులతో కలిసి వెళ్లి కూలీలతో మాట్లాడారు. గత ఎంపీ ఎన్నికలలో వినోద్‌కుమార్ ఓటమి పాలైనా నిత్యం ప్రజలలో ఉన్నాడన్నారు. కరీంనగర్, మనోహరబాద్ రైలును తీసుకువచ్చిన ఘనత దక్కిందన్నారు. ఐదు సంవత్సరాల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఏఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని మాట తప్పిందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ ఛైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గొట్టెపర్తి పర్శరాం, నాయకులు మీసరగండ్ల అనీల్‌కుమార్, సాదుల్, కూనబోయిన రఘు, ప్రశాంత్‌రెడ్డి, రాజారాం, సత్యనారాయణరెడ్డి, బాలయ్య, అంజయ్య, శ్రీనివాస్, రాములు, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పోచమ్మతల్లికి ముడుపు

అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ తల్లికి ఎంపీగా వినోద్‌కుమార్ గెలువాలని ఆయన సతీమణి మాధవి ముడుపుకట్టారు. ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిమ గల పోచమ్మ తల్లి ఆశీస్సులతో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

వస్త్ర పరిశ్రమల సమస్యల పరిష్కారం కోసం 22న నేతన్న దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 18: వస్త్ర పరిశ్రమల సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కరించి నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ సిరిసిల్లలో ఈ నెల 22న నేతన్న దీక్షను చేపడతామని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జేఏసీ కన్వీనర్ మూషం రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో గురువారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జేఏసీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై జేఏసీ చేసిన పోరాట ఫలితంగా 10 రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వస్త్ర పరిశ్రమల సమస్యలను పరిష్కరించి నేతన్నలకు ఉపాధిని కల్పిస్తామని వారం రోజుల్లో పెండింగ్ బిల్లులు, సబ్సిడీ డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో జేఏసీ పోరాటాన్ని తాత్కాలికంగా విరమణ చేసి పనులు ప్రారంభిస్తామని ప్రకటించామన్నారు. కానీ ఇప్పటికి పదిరోజులు గడిచినా మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 22న సోమవారం సిరిసిల్లలో నేతన్న దీక్షను భారీ ఎత్తున చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఇచ్చిన హామీలను అమల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు సిరిసిల్ల రవీందర్, పంతం రవి, మండల సత్యం, తాటిపాముల దామోదర్, మంచే శ్రీనివాస్, గోలి వెంకటరమణ, యేల్దండి శంకర్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, అశోక్, మండల రాజు, పిస్క మధు, వెల్దండి దేవదాస్, మోర రాజు, బండారి అశోక్, శ్రీరాం సత్యం, ఏనుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేక వేడుకలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో గురువారం శ్రీరాముడి పట్టాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, వర్తకసంఘ నాయకులు ఉప్పల వేణు, బోణగిరి రాము, నార్ల రాంకిషన్, దొంతుల శంకర్, శ్రీనివాస్, సతీష్, రాజేశ్వరశర్మ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 18: ఫుడ్ పాయిజన్‌తో గురుకుల విద్యార్థి మరణంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ చేపట్టాలి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ప్రశాంత్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడన్నారు. ఈ నెల 12 గురుకుల పాఠశాలలో విద్యార్థులు టిఫిన్ తిన్నాక ఫుడ్ పాయిజన్ కాగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించారన్నారు. 24 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలకు గురై వివిధ ఆసుపత్రులో కోలుకొంటున్నారని విద్యార్థి ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో అధికారులు ఈ నెల 13న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా మృత్యువుతో పోరాడుతూ మంగళవారం మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులు, సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమ హాస్టల్స్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, బైరగోని హర్షిత్, కోడం నరేష్, వసీం అక్రం, సమీ, సుదీప్, వంశీ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని విమర్శిస్తే ఊరుకోం

గంభీరావుపేట, ఏప్రిల్ 18: ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను విమర్శిస్తే ఊరుకోమని బీజేపీ నేతలు హెచ్చరించారు. గంభీరావుపేటలో బీజేపీ నాయకులు విలేకరుల సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. గంభీరావుపేటలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఎంపీ బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బండి సంజయ్ ఎంపీగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఎంపీ బండి సంజయ్ చేసిన అభివృద్ధిని చూసే తిరిగి భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు.

వినోద్‌కుమార్‌ను ప్రజలే కాదు బీఆర్ఎస్ కార్యకర్తలే నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇంకోసారి బండి సంజయ్‌ను విమర్శిస్తే ప్రజలే ఊరుకునే పరిస్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు దెవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు పత్తి స్వామిరాజు, మైనార్టీ మోర్చ అధ్యక్షుడు వాజిద్‌హుస్సేన్, నాయకులు లక్ష్మీపురం రాజు, కోడె రమేష్, అన్వర్, మురళీమోహన్, నాగరాజు, సర్వోత్తం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు అండగా నిలిస్తే అవమానిస్తారా..?

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీకి ఎమ్మార్పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాలు అండగా నిలిస్తే సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడం తగదని ఎమ్మార్పీఎస్ పార్లమెంటు ఎన్నికల రాజన్నసిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంటకస్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటస్వామి హాజరై మాట్లాడారు. రాజకీయంగా మాదిగలను ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ అణచివేస్తోందని అన్నారు.

ఇటీవల నారాయణఖేడ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌పై మాదిగల వ్యతిరేకతను గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలపై అనుకూలంగా మాట్లాడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలు ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని వెంకటస్వామి కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, చంద్రమౌళి, భిక్షపతి, కుమార్, దేవరాజు, కృష్ణంరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్గిరాజుకుంటే బుగ్గే



గోదాం మంటలను ఆర్పుతున్న సిబ్బంది(ఫైల్)

- కానరాని ఫైర్ సేఫ్టీ నిబంధనలు
- ఐదేళ్లలో 218 అగ్ని ప్రమాదాలు
- రూ.2.03 కోట్ల విలువైన ఆస్తినష్టం
- కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 18: ఎండలు మండి పోతున్నాయి. ఎండల తీవ్రతకు మంటలు ఎగిసిపడే అవకాశం ఉంది. వేసవికాలంలో ప్రజలు అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించాలి. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు ఏటా నిర్వహించే వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20న ముగియనున్నాయి.

● అధునాతన యంత్రాలు.. సిబ్బంది కొరత

జిల్లా వ్యాప్తంగా ఎండలు భగ్గుమంటున్నాయి. ఇప్పటివరరకు జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరుకుంది. ఎండల తీవ్రతకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. సిరిసిల్ల, వేములవాడ అగ్నిమాపక కేంద్రాల్లో ఆధునాతన యంత్రాలు ఉన్నా సిబ్బంది అంతంతమాత్రమే ఉన్నారు. సిరిసిల్లలో ఒక అగ్నిమాపక వాహనం, మినీ వ్యాన్, బుల్లెట్‌లు ఉన్నాయి. వేములవాడలో ఒక అగ్నిమాపక వాహనం, ఒక బుల్లెట్ మాత్రమే ఉంది. వీటితోపాటు పోర్టబుల్ పంపులు, బ్రీతింగ్ ఆపరేటర్ సెట్స్, వాటర్, ఫోమ్, పౌడర్, సీవో1 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 24గంటలు పనిచేయాల్సిన అగ్నిమాపక శాఖకు సిబ్బంది కొరత వెంటాడుతోంది. సిరిసిల్లలో ఫైర్ ఆఫీసర్ పోస్టుఖాళీగా ఉండడంతో హెడ్‌కానిస్టేబుల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మరో ఆరు ఫైర్‌మెన్ పోస్టులు, ఒక డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వేములవాడలో రెండు డ్రైవర్ పోస్టులు, ఆరు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా వెంటనే 08723-232901(సిరిసిల్ల), 08723-238101 (వేములవాడ), కంట్రోల్ రూం నెంబర్ 101కు డయల్ చేసి సమాచారం అందిస్తే ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను నివారిస్తారు.

● ఐదేళ్లలో ప్రమాదాలు, ఆస్తినష్టం

జిల్లాలో ఐదేళ్లలో 218 అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో దాదాపు రూ.2.03కోట్ల ఆస్తినష్టం సంభవించింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేసి దాదాపు 11.92 కోట్ల విలువైన ఆస్తులను కాపాడారు. సిరిసిల్ల పట్టణంలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని నడిబొడ్డున సెస్ కార్యాలయంలో దీపావళి రోజున ఓ రాకెట్ రికార్డు రూంలో పడి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో విలువైన రికార్డులు ఖాళీపోయాయి. కొంతసేపటికే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పడంతో చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా ప్రమాదం తప్పింది.

ముస్తాబాద్ మండలం ఆవునూరు శివారులో గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సిరిసిల్ల శివారులోని డంప్ యార్డ్‌లో అక్టోబరు 25న మంటలు వ్యాపించడంతో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పేశారు. తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి వద్ద ఓ గోదాంలో దీపావళి రోజున పటాకలు పడి మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న సిరిసిల్ల, వేములవాడ ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

అంతకుముందు సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట 2018లో ఓ టైలర్ షాప్‌లో దీపం అంటించి యజమాని బయటకు వెళ్లాడు. షాప్‌నుంచి వెళ్లిన కొద్దిసేపటికి దుకాణం కాలిపోయింది. దుకాణంలో ఉన్న రెడ్‌మెడ్ దుస్తులు, సామగ్రి, కుట్టుమిషన్లు కాలిపోయి దాదాపు రూ.10లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇదే విధంగా కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌లో రెండు సిలిండర్‌లు పేలి మూడు గుడిసెలు మంటల్లో కాలిపోయాయి. సిరిసిల్ల అర్బన్ మండలంలోని పెద్దూర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మంటలు అంటుకున్నాయి. కూలీలు వేసుకున్న ఐదు గుడిసెలు, ఒక మోటార్ సైకిల్ దగ్ధమయ్యాయి. ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి కొట్టంపై పడి దాదాపు రూ.4 లక్షల ఆస్తినష్టం సంభవించింది. 2020లో చంద్రంపేట సమీపంలోని ఐచర్ ట్రాక్టర్ షోరూంలోని సర్వీసింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించి నాలుగు ట్రాక్టర్‌లు దగ్ధమై తీవ్రనష్టం వాటిల్లింది. 2021లో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమై రూ. 2లక్షల నష్టం వాటిల్లింది. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లోని ఓ పెట్రోల్ బంక్ వద్ద అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సిరిసిల్ల పట్టణంలోని ఆటో నగర్‌లో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించి ఫర్నీచర్ దగ్ధమైంది.

● అగ్నిప్రమాదాలకు నెలవు

ఎండ తీవ్రతకు అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా గడ్డివాములు, గుడిసెలు , ఇతర వ్యర్థ పదార్థాల కారణంగా ఎక్కువగా మంటలు వ్యాపిస్తాయి. వీటి సమీపంలో ఎవరైనా సిగరెట్, బీడీలు తాగి పారేస్తే అగ్గి రాజుకుంటుంది. ఇవేకాకుండా పత్తి, మిరప, కంది తదితర పంటలు కోసిన తర్వాత కట్టె కాలబెడుతుంటే మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ఈ మంటలు పొలాల గట్లపై ఉన్న గడ్డివాములకు అంటుకుంటాయి. ఇవేకాకుండా అడవులు అంటుకొని కాలిపోతుంటాయి. మరోవైపు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భవనాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి.

● ఇళ్లలో ప్రమాద సూచికలు

ప్రధానంగా ఇళ్లల్లోనే ప్రమాద సూచికలు కనిపిస్తుంటాయి. చిన్నపిల్లలు అగ్గిపెట్టెలతో ఆటలాడటం, ఇంట్లో గ్యాస్ స్టౌ ఆన్‌చేసి మరిచిపోవడం, కిరోసిన్, పెట్రోల్‌లు వంటివి ఇంట్లో నిల్వచేయడంతో ప్రమాదాలు చోటుచేసు కుంటాయి. ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి మరిచిపోతే అగ్గిరాజుకుంటుంది. దీపాలకు వేడి ఎక్కువై ఇల్లంతా మంటలు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లల్లో విద్యుత్ స్విచ్‌బోర్డులను ఏటా మరమ్మతు చేయించుకోవాలి స్విచ్ బోర్డులతో షార్ట్‌సర్క్యూట్ సంభవించే ప్రమాదం ఉంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

- టి. నర్సింహాచారి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల



జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఫైర్‌స్టేషన్‌లలో ఆధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నాం.

నివారణ చర్యలు

- వంటింటి పైభాగంలో గాలి వెలుతురు వచ్చేలా ఉండాలి.
- గ్యాస్‌ట్యూబ్‌ను మార్చుకోవాలి.
- సిలిండర్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి.
- మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు.
- వంటిగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచకూడదు.
- స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రులలో ఆర్‌సీసీ కాంక్రీట్ స్లాబులనే పైకప్పుగా వాడాలి.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు దూరంగా వేయాలి.



అగ్నిమాపక యంత్రం

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవండి

● ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కొడిమ్యాలలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్



బీజేపీలో చేరిన వారితో ఎంపీ బండి సంజయ్

కొడిమ్యాల, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. గురువారం రాత్రి కొడిమ్యాల మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో సంఘం నాయకులు, సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల కుల సంఘాల నాయకులు పలువురు సంజయ్ సమక్షంలో సుమారు 150 మంది బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి బండి సంజయ్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దొరకటం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే లాభం ఎవ్వరికి అన్నారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రైతులను మోసం చేయటానికే ఆగస్టులో రుణమాఫీ చేస్తామనటం మోసం అన్నారు. తనకు ఓటు వేసి పార్లమెంట్‌కు పంపి మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభ, అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస యాదవ్, మండల బీజేపీ నాయకులు రాజేశం, అంజయ్య, నర్సింహరెడ్డి, రాజు, శ్రీనివాస్, చిరంజీవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18: నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎడ్ల రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, తదితరులకు మిఠాయిలు తినిపించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని అన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, దేవయ్య, బుచ్చాగౌడ్, బాబు, రాజు, మల్లేశం, శ్రీనివాస్, రాజేందర్, రాజునాయక్, మల్లారెడ్డి, దేవయ్య, రవి, గణపతి, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న నాయకులు

సుద్దాలలో సినీ ఫైట్ మాస్టర్ల సందడి

కోనరావుపేట, ఏప్రిల్ 18: కోనరావుపేట మండలం సుద్దాలలో సినిమా పరిశ్రమ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్ గురువారం సందడి చేశారు. విద్యార్థి సంఘాల రాష్ట్ర జేఏసీ ఛైర్మన్, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి నేత ఎర్రబెల్లి జగన్ వివాహ రిసెప్షన్ సుద్దాలలో జరిగింది. దీనికి సినీ పరిశ్రమ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. యువకులు సినీ ఫైటర్లతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

మిడ్ మానేరులో చిక్కిన భారీ చేప

బోయినపల్లి, ఏప్రిల్ 18: బోయినపల్లి మిడ్ మానేరు జలాశయంలో ఓ మత్స్యకారుడికి భారీ చేప చిక్కింది. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో మత్స్యకారులు చేపల వేట ప్రారంభించారు. గురువారం కొదురుపాక గ్రామానికి చెందిన రాకం అనిల్ ప్రాజెక్టు సమీపంలో చేపల వేట కొనసాగించగా వలలో 30 కేజీల బరువున్న బొచ్చ చేప చిక్కింది. చేపను అనిల్ రెండువేల రూపాయలకు విక్రయించాడు.

మే డే సందర్భంగా అమరులను స్మరించుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 18: మే డే సందర్భంగా అమరులను స్మరించుకోవాలని, ఎర్ర జెండా పోరాటాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం సీపీఐ కార్యాలయంలో మే డేను విజయవంతం చేయాలంటూ వాల్‌పోస్టర్‌ను సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. కార్మిక యూనియన్స్ రిజిస్ట్రేషన్స్ చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ఉపాధి కార్మికులకు రెండు వందల రోజుల పని కల్పించి రోజుకు 600 రూపాయలు చెల్లించాలన్నారు. మే 1న మే డేను పట్టణాలు, గ్రామాలలో వాడవాడలో ఎర్ర జెండాలను ఆవిష్కరించి పోరాట వీరులను స్మరించుకొంటూ సభలను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జిల్లా నాయకులు మీసం లక్ష్మణ్ , సోమ నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

- పంచాయతీ అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

ముస్తాబాద్, ఏప్రిల్ 18: ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో అధికారుల నేతృత్వంలోనే విచ్చలవిడిగా అక్రమనిర్మాణాలు జరగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముడుపులు ముడితే చాలు పట్టణ ప్రణాళికలపై దృష్టిలేకుండా ఇష్టారీతిలో అనుమతులు ఇస్తూ అక్రమ నిర్మాణాలకు అధికారులే ఆజ్యం పోస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ పక్కనే ప్రధాన రహదారి పక్కన అక్రమ నిర్మాణం జరుగుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ముస్తాబాద్ సామాజిక కార్యకర్త చింతోజు బాలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ అధికారుల కరువైందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. పైగా దానిపైనే మరో నిర్మాణం చేపడుతున్నారని ఎవరి అండదండలున్నాయని మండిపడ్డారు. ఈవిషయంపై తహసీల్దార్, ప్రత్యేకాధికారిని బాలయ్య ప్రశ్నించగా గ్రామపంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దని జీపీ అధికారులకు ఆదేశించారు.

● కొనసాగుతున్న నకిలీ రశీదుల కలకలం

ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీలో నకిలీ రశీదుల కలకలం కొనసాగుతోంది. పంచాయతీలో అక్రమార్కుల తీరుతో నకిలీ రశీదులు సృష్టించి ఆదాయాన్ని దోచుకుంటున్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును అధికారుల ఖాతాల్లోకి జమా అవుతోంది. గత పాలకవర్గ సమయంలో ఆదాయం తక్కువ వస్తుందని గమనించిన సర్పంచ్‌తో పాటు పాలకులు రశీదులపై దృషి సారించారు. అనుమానం వచ్చి బుక్కులను పరిశీలించగా సీరియల్ నంబర్‌లో తేడాలో కనిపించాయి. నకిలీ బుక్కులు ప్రింట్ చేసి పన్నులు వసూలుచేసి జేబుల్లో వేసుకున్నారు. అప్పట్లో నకిలీ రశీదు బుక్కులను పంచాయతీ కార్యదర్శి ప్రింట్ చేశారని పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. దాదాపు రెండు లక్షల రూపాయల వరకు పక్కదారి పట్టించారని నూతన అక్రమ నిర్మాణాల విషయంలో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులకు నివేదిక వెళ్లినా ఏడాది కాలంగా చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం నలుగురు సిబ్బందికి మోమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. అప్పుడు పనిచేసిన ఈవో రాజు ఈవిషయం జరిగిన అనంతరం సెలవు పెట్టి వెళ్లి మళ్లీ డిప్యూటేషన్‌పై ఓ చిన్న గ్రామంలో పనిచేశాడు. ఇటీవల మళ్లీ ముస్తాబాద్‌కు సదరు అధికారి రావడంతోనే అక్రమ నిర్మాణాల గొడవ పెరగడంతో పాటు గురువారం మళ్లీ ఓ ముస్తాబాద్ వాసి 2,700 రూపాయలు చెల్లిస్తే రశీదు బుక్కులో 1,300 రూపాయలు ఇచ్చినట్టుగా ఉండటంపై మండిపడుతున్నారు. గ్రామపంచాయతీ అవినీతి కేంద్రంగా మారిందని అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకువాలని జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు కోరుతున్నారు.



పత్రాలను చూపుతున్న బాలయ్య



రశీదు బుక్కులో డబ్బులో ఉన్న తేడాలు